క్లుప్తంగా

క్రీడలు శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి

గుంటూరు రూరల్: క్రీడల వల్ల పోటీతత్వం పెరగటంతోపాటు ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని ఏటుకూరు శాఖ గ్రంథాలయం అధికారి పి.పరమేశ్వరి తెలిపారు. 56వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం ఏటుకూరు గ్రంథాలయం వద్ద స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించారు. పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అగౌరవం, వ్యంగ్యంగా పోస్టులు పెట్టిన వ్యక్తిపై ఫిర్యాదు



గుంటూరు ఈస్ట్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, నటుడు పోసాని కృష్ణమురళి, గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజులపై ఫేస్‌బుక్‌లో ఓ వ్యక్తి వ్యంగ్యంగా, అగౌరవంగా పోస్టులు పెట్టడంపై న్యాయవాదులు అరండల్‌పేట పోలీసుస్టేషన్ శనివారం ఎస్‌హెచ్‌ఓ రామానాయక్‌కు ఫిర్యాదు చేశారు. న్యాయవాది వేముల ప్రసాద్ మాట్లాడుతూ అడుసుమల్లి వెంకట అప్పారావు ఫేస్‌బుక్‌లో ముఖ్యమంత్రి, ఐజీ, సినీనటుడు పోసాని కృష్ణమురళిపై వ్యంగ్యంగా పోస్టులు పెట్టి అగౌరపరిచాడని తెలిపారు. ఒక రాజకీయ పార్టీ వారిని రెచ్చగొట్టే విధంగా ఫేస్‌బుక్‌లో అప్లోడ్ చేశారని పేర్కొన్నారు. వెంకట అప్పారావుపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. దీనిపై న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఫేస్‌బుక్‌లో తప్పుడు పోస్టర్లు పెట్టడాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. న్యాయవాదులు బార్ కౌన్సిల్ మెంబర్ వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, బి.కోటేశ్వరరావు, సీడీ భగవాన్, క్రాంతికుమార్, జయపాల్, శ్రీనివాస రెడ్డి, షేక్ నజీర, కృష్ణారెడ్డి తదితరులు స్టేషన్‌కు వచ్చిన వారిలో ఉన్నారు.

ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుళ్ల కుటుంబాలకు ఆర్థిక సాయం



నెహ్రూనగర్: అనారోగ్యంతో మృతి చెందిన ఇద్దరు ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుళ్ల కుటుంబాలకు గుంటూరు డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కానిస్టేబుల్ అండ్ హెడ్‌కానిస్టేబుల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించడం అభినందనీయమని ఆ శాఖ డెప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లాలో పనిచేస్తున్న ఎక్సైజ్ శాఖ సిబ్బంది సహకారంతో హెడ్ కానిస్టేబుళ్లు ఆర్.శ్రీనివాసరావు, ఐ. వి. భూపతి కుటుంబ సభ్యులకు రూ.95 వేలు చొప్పున ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో శనివారం అధికారులు అందజేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ వెంకటరామిరెడ్డి, పల్నాడు జిల్లా సెబ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్, అసోసియేషన్ అధ్యక్షుడు మార్పు కోటయ్య, అసోసియేషన్ నాయకులు బి.ఎస్.ఎస్. రాజు, శ్రీమన్నారాయణ, శంకరరావు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నాగరిక సమాజపు అసలైన లక్షణం సహనం



లక్ష్మీపురం: నాగరిక సమాజపు అసలైన లక్షణం సహనమని, తెలియని విషయాలను తెలుసుకోవడానికి సహనమే ఉత్తమ మార్గమన్న విషయాన్ని గుర్తెరిగి ప్రవర్తించాలని మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎస్.మూర్తి తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో అంతర్జాతీయ సహన దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆదరణ కరువైన టీడీపీ, జనసేన నిరసన

నగరంపాలెం: టీడీపీ, జనసేన శనివారం ఏటీ అగ్రహారం ప్రధాన రహదారిలో నిర్వహించిన కార్యక్రమానికి ఆదరణ కరువైంది. రూ.13 కోట్లతో ఈ రహదారి విస్తరణ పనులు జరుగుతుంటే ఆందోళన చేపట్టడం స్థానిక ప్రజల్ని విస్మయానికి గురిచేసింది. రోడ్డు అభివృద్ధి చేయడం రెండు పార్టీలకు ఇష్టం లేదా? అని చర్చించుకున్నారు. ఎస్‌కేబీఎం ఉన్నత పాఠశాల వద్ద ప్రారంభమైన నిరసన ర్యాలీ ఏటీ అగ్రహారం జీరో వీధి వరకు కొనసాగింది. మళ్లీ అక్కడ నుంచి ఏటీ అగ్రహారం నాలుగో వీధి సగం వరకు వెళ్లి వెనుదిరిగారు. ఇక కొత్తగా సైడు కాల్వలు నిర్మించగా, మురుగునీరు పారుదలయ్యే క్రమంలో రహదారిపైకి నీరు చేరింది. అక్కడ జనసేన, టీడీపీ నేతలు ఫొటోలు, సెల్ఫీలు దిగడం కనిపించింది. రహదారి ఇరువైపులా ఎవరితోనూ మాట్లాడలేదు. నినాదాల చేసుకుంటూ ముందుకు సాగారు. ఎవరితోనైనా మాట్లాడితే వ్యతిరేకత వస్తుందనే ఆలోచనతో మిన్నకుండిపోయారు.

గ్రంథాలయాల్లో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు



పెదకాకాని జేఎంజే స్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న సిస్టర్ రెజీనా



వక్తృత్వ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రత్తిపాడు: 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలల్లో భాగంగా శనివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ అరుణ ఆధ్వర్యంలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. జూనియర్స్ విభాగంలో ఆరు, ఏడు తరగతుల విద్యార్థులకు 'భారత రాజ్యాంగం-అంబేడ్కర్' అనే అంశంపై, ఎనిమిది, తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు సీనియర్స్ విభాగంలో 'అతివేగం-ప్రమాదాలు-నివారణ' అంశంపై పోటీలు జరిగాయి. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన అరవై మంది విద్యార్థినీ, విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా ప్రత్తిపాడు భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు రాజు, అక్షయ విద్యాలయం గణిత ఉపాధ్యాయుడు మణిరత్నం, సోషల్ ఉపాధ్యాయురాలు దీనాలు వ్యవహరించారు. విజేతలకు వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందిస్తామని అరుణ తెలిపారు.

పెదకాకాని: విద్యార్థులు చిన్నతనం నుంచి గ్రంథాలయాలకు వెళ్లడం అలవాటు చేసుకోవాలని జేఎంజే కరస్పాండెంట్ సిస్టర్ రెజీనా అన్నారు. గ్రంథాల వారోత్సవాలను పురస్కరించుకుని శనివారం పెదకాకాని జేఎంజే స్కూల్‌లో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, గ్రంథాలయాలు వాటి ప్రాముఖ్యత అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అలానే సీనియర్స్‌కు సమాజంపై సాంకేతికత ప్రభావం అనే అంశంపై వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రంథాలయ అధికారి వేముల విజయకుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిస్టర్ రెజీనా మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచి గ్రంథాలయానికి వెళ్లటం అలవాటు చేసుకోవాలని తద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. చదువుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి, గ్రంథాలయాల్లోని సభ్యత్వం గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సెయింట్ జోసెఫ్ హై స్కూల్ ఉపాధ్యాయులు జ్యోతి, కల్పన, తులసి పాల్గొన్నారు.

విద్యార్థులు ఆవిష్కర్తలుగా మారాలి

- అప్పుడే దేశ ప్రగతిలో పురోగతి
- ప్రాగ్మాటిక్ సాఫ్ట్ వెర్ కంపెనీ ఫౌండర్ సీఈఓ భరత్ గుజవర్తి
- ఆర్‌వీఆర్‌జేసీ కళాశాలలో ప్రోటోటైప్ చాలెంజ్ పోటీలు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: విద్యార్థులు ఆవిష్కర్తలుగా తయారైనప్పుడే దేశ ప్రగతిలో పురోగతి సాధించవచ్చని హైదరాబాద్‌కి చెందిన ప్రముఖ సాఫ్ట్ వెర్ కంపెనీ ప్రాగ్మాటిక్ సాఫ్ట్ వెర్ కంపెనీ ఫౌండర్ సీఈఓ భరత్ గుజవర్తి పేర్కొన్నారు. శనివారం చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ప్రోటోటైప్ చాలెంజ్ 2023 పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు కళాశాలలోని ఇన్నో ఫోర్జ్ ఐడియేట్ అండ్ ప్రోటోటైప్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించటం జరిగిందన్నారు. ఈ పోటీల్లో కళాశాలలోని వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు తయారు చేసిన యంత్ర పరికరాల నమూనాలను సందర్శించారు. వాటి పనితీరు సామర్థ్యాన్ని అందులో ఉపయోగించే వివిధ రకాల ఇంధన, రసాయన తదితర వినియోగ వస్తువులను గూర్చి, అందుకు అంచనా వ్యయాన్ని, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులు ఆయనకు వివరించారు. పోటీల్లో విద్యార్థులు స్మార్ట్ ఎడ్యుకేషన్, బయో-టెక్, హెల్త్-టెక్, వ్యవసాయం ఆహార ఉత్పత్తి, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, స్మార్ట్ ఆటోమేషన్, రోబోటిక్ డ్రోన్స్, స్మార్ట్ వెహికల్స్, క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ, రేనేవబుల్ ఎనర్జీ, ఫిట్నెస్ అండ్ స్పోర్ట్స్, సైబర్ సెక్యూరిటీ తదితర అంశాలపై విద్యార్థులు రూపొందించిన వివిధ రకాల పరికరాల నమూనాలను ప్రదర్శన ఏర్పాటు చేశారు.

విపత్తు సమయాలలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కార మార్గాలను పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా విద్యార్థులు వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రజరర్ డాక్టర్ కె.కృష్ణ ప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎస్వీ శ్రీనివాసరావు, ప్రోగ్రాం కన్వీనర్లు డాక్టర్ కె.కార్తీకపవన్, డాక్టర్ అపర్ణ, డాక్టర్ నాగమల్లేశ్వరారవు, డాక్టర్ ఎం.వీపీ చంద్రశేఖర్, డాక్టర్ రాధిక, డాక్టర్ వి శేషశ్రీనివాస్, డాక్టర్ తారాశశాంక్, డాక్టర్ ఈశ్వర్‌చైతతన్య, ఎం.శ్రీనివాసరావు తదితరులున్నారు.

ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై అవగాహన



పాఠశాల విద్యార్థులతో కళాశాల విభాగం

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు కిట్స్ కళాశాల ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగం ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గుంటూరు నగరంలోని శ్రీ విజేత హైస్కూల్, జిల్లా పరిషత్ ఉర్దూ హైస్కూల్స్‌లో ఎనిమిది, తొమ్మిది తరగతుల విద్యార్థులకు విభాగాధిపతి డాక్టర్ జి.మురళి, ఐఐసీ కన్వీనర్ డాక్టర్ ఎస్.నాగేంద్రం, ఇన్నోవేషన్ కో-ఆర్డినేటర్ జాన్ సైదాలు అవగాహన కల్పించారు. రానున్న రోజుల్లో సమాజంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏఐ రంగాలను ఎలా ప్రభావితం చేస్తుంది, అధునాతన టెక్నాలజీ ద్వారా కలిగే ప్రయోజనాలు, ఎదురయ్యే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. పాఠశాల డైరెక్టర్ శ్రీ చెరుకూరి శ్రీహరి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థినీ విద్యార్థుల్లో నూతన ఆలోచనలు, ఆవిష్కరణలకు దోహదపడతాయన్నారు. కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలు చేసేందుకు ముందుకు వచ్చే విద్యార్థులకు తమవంతుగా ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి కోయి శేఖర్, ప్రిన్సిపల్ డాక్టర్ కె. హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీ రంగంలో విస్తృత మార్పులు

ప్రాగ్మాటిక్ సిస్టమ్స్ అధినేత జి. భరత్‌కుమార్ రెడ్డి



మాట్లాడుతున్న భరత్‌కుమార్ రెడ్డి

ప్రత్తిపాడు: భవిష్యత్‌లో టెక్నాలజీ రంగంలో విస్తృత మార్పులు చోటు చేసుకుంటాయని ప్రాగ్మాటిక్ సిస్టమ్స్ అధినేత జి. భరత్‌కుమార్ రెడ్డి అన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో 'వ్యవస్థాపకుడు-నాయకత్వం'పై సెమినార్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రాగ్మాటిక్ సిస్టమ్స్ అధినేత జి. భరత్‌కుమార్ రెడ్డి హాజరయ్యారు. టెక్నాలజీలో వస్తున్న మార్పులు, ఐటి రంగం ప్రాముఖ్యతలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో ప్రతి రంగం ఐటీ టెక్నాలజీపై ఆధారపడి ఉందన్నారు. టెక్నాలజీ నరంగా రోబోటిక్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటాసైన్స్ రంగాలు అభివృద్ధిని సాధిస్తున్నాయన్నారు. విద్యార్థులు ఆయా రంగాల్లో వస్తున్న విప్లవాత్మక మార్పులను అవగతం చేసుకుని, కెరీర్‌ను మరింతగా వృద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మలినేని విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎం. పెరుమాళ్లు, ప్రిన్సిపల్ జెట్టి అప్పారావు, సీఎస్‌ఈ విభాగాధిపతి రామస్వామి, ఆయా విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

దళితులకు అండగా ఉంటా

ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం. విక్టర్ ప్రసాద్



సందీప్ తల్లి, కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం. విక్టర్ ప్రసాద్

ప్రత్తిపాడు: దళితులకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తానని, ధైర్యంగా ఉండాలని ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం. విక్టర్ ప్రసాద్ అన్నారు. వట్టిచెరుకూరు అయ్యన్నగుంటపల్లెలో కొద్దిరోజుల కిందట దళిత యువకుడు గేరా సందీప్ అనుమానస్పద స్థితిలో మృతి చెందడం, కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును పోలీసులు నమోదు చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో సందీప్ కుటుంబాన్ని శనివారం రాత్రి ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ పరామర్శించారు. సందీప్ తల్లి, కుటుంబ సభ్యులతోతో మాట్లాడారు. వారి ఓదార్చారు. అసలేం జరిగిందన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడవద్దని, న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పరిహారంగా నగదును ఇవ్వడం జరుగుతుందని, అంతేకాకుండా ఇంటి స్థలంతో పాటు సందీప్ సోదరుడికి ఉద్యోగం, తల్లికి పింఛను కూడా వస్తుందని ఈ మేరకు చర్యలు తీసుకుంటామని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. దళితులకు న్యాయం చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎల్లప్పుడూ ముందుంటారన్నారు. ఆయన నాయకత్వంలో పూర్తి న్యాయం చేస్తామని విక్టర్‌ప్రసాద్ చెప్పారు. సీఎం జగన్ మాటలను మాత్రమే నమ్మాలని సూచించారు. వెంట గుంటూరు ఆర్డీవో శ్రీకర్, డీఎస్పీ, తహసీల్దార్ తదితరులున్నారు.

బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణస్వామిపై కాలనీవాసుల ఆగ్రహం

నెహ్రూనగర్: బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ రోడ్డు విస్తరణ పనులు సక్రమంగా పూర్తి చేయడం లేదంటూ వెంకట కృష్ణ కాలనీ (బండ్ల బజార్)వాసులు నగరపాలక సంస్థ కార్యాలయం కౌన్సిల్ హాలు వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. కాలనీలో ఓ రోడ్డు విస్తరణ చేసే క్రమంలో మొత్తం 33 గానూ 30 ఇళ్లను పట్టణ ప్రణాళిక అధికారులు కొట్టి వేశారన్నారు. మిగిలిన మూడు ఇళ్లను తొలగించకుండా ఒకటిన్నర సంవత్సరం నుంచి టౌన్ ప్లానింగ్ సెక్షన్ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణస్వామి అడ్డు పడుతున్నారని ఆరోపించారు. మూడు ఇళ్ల వల్ల రోడ్డులో ట్రాఫిక్ సమస్య ఇబ్బందికరంగా ఉందని కాలనీవాసులు తెలిపారు. లక్ష్మణస్వామి కావాలని వారి ఇళ్లు తొలగించడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు వచ్చి సమాధానం చెప్పాలంటూ నినాదాలు చేశారు.

తాగునీరు వృథా

నెహ్రూనగర్: పైపులైనుకు లీకు ఏర్పడి తాగునీరు వృథాగా పోతున్నా ఇంజినీరింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సాయిబాబానగర్ 2వ లైను, పెదపలకలూరు రోడ్డు, యూనియన్ బ్యాంకు ఎదురుగా పైపులైనుకు లీకులు ఏర్పడి నీరు ధారగా పోతోంది. బ్యాంకు సిబ్బందితో పాటు స్థానికులు ఐదు రోజుల కిందట మున్సిపల్ సిబ్బందికి సమాచారం ఇచ్చినప్పటికీ పట్టించుకున్న పాపాన పోలేదు. లీకు ఏర్పడిన పైపులైను పక్కనే విద్యుత్ స్తంభం ఉండటంతో స్థానికులు భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులైనుకు మరమ్మతులు చేయాలని వారు కోరుతున్నారు.

చార్జ్ మెమోలు ఉపసంహరించుకోవాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకు గుంటూరు డీఈవో ఇచ్చిన చార్జ్ మెమోలు ఉపసంహరించుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పి. పాండురంగ వరప్రసాదరావు డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం డీఈవో కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పాండురంగ వరప్రసాదరావు మాట్లాడుతూ చిన్న కారణాలతో ఉపాధ్యాయులకు జారీ చేసిన చార్జ్ మెమోలు ఉపసంహరించుకోని పక్షంలో, పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పాఠశాలల తనిఖీల సమయంలో విద్యార్థుల ఎదుట హెచ్‌ఎంలు, టీచర్లను కించపర్చే విధంగా వ్యవహరించడం తగదని తెలిపారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు, రాష్ట్ర కార్యదర్శి చాంద్ బాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఖాలీద్, పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు, ఏపీ ఎన్జీవో నాయకులు మూర్తి, పెన్షనర్స్ నాయకులు నాగరాజు, దాస్, రమేష్, శ్రీలక్ష్మి, సత్యనారాయణమూర్తి, పెద్దసంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హిందీ ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: స్వామి వివేకానంద ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్ నిర్వహించిన రాజ భాషా హిందీ ఒలింపియాడ్ పరీక్షల్లో పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురంలోని పాఠశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో స్వర్ణ పతకాలు సాధించిన ఐదుగురు విద్యార్థులతో పాటు ప్రశంసాపత్రాలు పొందిన 137 మంది విద్యార్థుల్ని అభినందించారు. మాతృభాషతో పాటు జాతీయ భాష హిందీలో సైతం విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపి స్వర్ణ పతకాలు సాధించడం గొప్ప విషయమని తెలిపారు. ఏటా ఇదే విధంగా విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొని, మరెన్నో పతకాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు సౌజన్య, నాగమల్లేశ్వరి, కాత్యాయినిని అభినందించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ పాల్గొన్నారు.

నేడు సర్రాజు స్మారక 'యశస్వి' పురస్కారాల ప్రదానం

గుంటూరు వెస్ట్: సర్రాజు వేణుగోపాలరావు స్మారక 'యశస్వి' పురస్కారాల ప్రదానోత్సవాన్ని ఆదివార సాయంత్రం 7 గంటలకు స్థానిక లక్ష్మీపురంలోని త్యాగరాజ సాంస్కృతిక సంఘంలో నిర్వహించనున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు సర్రాజు బాలచంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యుత్తమ విలువలతో ఉపాధ్యాయ వృత్తికే గౌరవం తెచ్చిన గోపాలరావు పేరుతో ఏటా తమ కుటుంబ సభ్యులు ప్రతిభగల కొందరిని ఎంపిక చేసి యశస్వి పురస్కారంతో సత్కరిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది అవార్డులను నాటక రచయిత డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు, ఎంపీయూపీఎస్ లేమల్లెపాడు ప్రధానోపాధ్యాయుడు పసుపులేటి శ్రీధర్, చలనచిత్ర దర్శకుడు ఎస్.వై. గౌతం రాజులకు అందజేస్తామని తెలియజేశారు.

ఆరు బయట మల విసర్జనతో అనారోగ్యం

నెహ్రూనగర్: ప్రతి ఒక్కరూ మల, మూత్ర విసర్జనకు మరుగుదొడ్లనే ఉపయోగించాలని 21వ డివిజన్ కార్పొరేటర్ గురవయ్య తెలిపారు. వరల్డ్ టాయిలెట్ డేను పురస్కరించుకొని కృష్ణబాబు కాలనీలో ఐటీసీ ఆధ్వర్యంలో విద్యార్థులకు, కాలనీవాసులకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఆరు బయట మల, మూత్ర చేయడం ద్వారా అనారోగ్యంతో పాటు వ్యాధులు వ్యాపిస్తాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఇంటిలో మరుగుదొడ్డి నిర్మించుకోవాలని ఆయన సూచించారు.

చిప్స్‌లో ముగిసిన అంతర్జాతీయ సదస్సు



రీసెర్చ్ స్కాలర్స్‌కు బహుమతులు అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: రోజువారి మనం వినియోగించే కొన్ని ఔషధాలలో లోపాలను బట్టి ప్రభుత్వం కానీ ఎఫ్‌డీఏ కానీ అప్పుడప్పుడు నిషేధించటం లేదా రీకాల్ చేయటం జరుగుతుంటుందని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ విద్యాధర్ తెలిపారు. శనివారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో గత రెండు రోజులుగా క్వాలిటీ బై డిజైన్ ఏ రోడ్ మ్యాప్ ఫర్ క్వాలిటీ ఫార్మాస్యూటికల్ ప్రొడక్ట్స్ అనే అంశంపై జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు శనివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఔషధాల తయారీ ప్రక్రియలో గమనించని లోపాలు, లేదా అందని లోపాలు తరువాత పరిశోధనల్లో గుర్తించటం ఆ లోపాల కారణంగా ఆఔషధాలు మానవాళి ఆరోగ్యంపై దుష్ప్రభావాలు చూపించటం జరుగుతుందన్నారు. అటువంటి అధునాతన క్యూబిడీ సాంకేతిక విధానం ద్వారా ఔషధాల తయారీ ప్రక్రియ దశలో ఉత్పన్నమయ్యే అతి సూక్ష్మ లోపాలను సైతం పరిశోధకులు, శాస్త్రవేత్తల దృష్టికి తీసుకురావటం మాత్రమే కాకుండా లోపాలను రూపకల్పన దశలోనే సరిదిద్దే అవకాశం ఉంటుందన్నారు. ఈ ప్రాధాన్యతను గుర్తించి క్యూడిబీ అనే అంశాన్ని శీర్షికగా ఈ సదస్సును నిర్వహించగా పలు దేశాలనుంచి పరిశోధకులు ఈ సదస్సులో పాల్గొని తమ పరిశోధనలు అందజేయటం జరిగిందన్నారు. కార్యక్రమంలో భాగంగా ఏపీటీఐ ఏపీ స్టేట్ బ్రాంచ్ అధ్యక్షుడు డాక్టర్ కె.వెంకట రమణ, ఏపీటీఐ ఏపీ స్టేట్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు డాక్టర్ వై.అంకమ్మ చౌదరి, ఐపీజీఏ ఏపీ స్టేట్ బ్రాంచ్ సెక్రటరీ డాక్టర్ పి.శ్రీనివాస్‌బాబు, ఐపీఏ ఏపీ స్టేట్ బ్రాంచ్ సెక్రటరీ డాక్టర్ ఎం.ప్రసాదరావుల చేతుల మీదుగా ఉత్తమ పరిశోధన పత్రాలను అందించిన 16 మంది రీసెర్చ్ స్కాలర్స్‌కు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ సీఎస్ శ్రీనివాస్, కోశాధికారి ఆర్.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ వర్సిటీకి జాతీయస్థాయి పేటెంట్



ప్రొఫెసర్ జీ.శ్రీనివాసరావును అభినందిస్తున్న చైర్మన్ లావు రత్తయ్య, వీసీ పి.నాగభూషణ్

చేబ్రోలు: మండల పరిధిలోని వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీకి జాతీయస్థాయి పేటెంట్ మంజూరైందని వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ శనివారం తెలిపారు. విజ్ఞాన్ యూనివర్సిటీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ జీ.శ్రీనివాసరావు, జేఎన్‌టీయూ కాకినాడలోని ఈఈఈ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ప్రొఫెసర్ ఎస్.శివనాగరాజులు సంయుక్తంగా ప్రతిపాదించిన ''హైబ్రిడ్ ఆటో రిక్షా'' అనే అంశానికి ప్రముఖ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ ఇండియా అథారిటీ పేటెంట్‌ను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించిందన్నారు. ఈ పేటెంట్‌కు 20 సంవత్సరాల పాటు హక్కులు ఉంటాయన్నారు. హైబ్రీడ్ ఆటో రిక్షాల సహాయంతో దేశంలోని పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో శబ్ద, కాలుష్య రహిత రవాణా వ్యవస్థను అందించవచ్చునన్నారు. ఆటో రిక్షాల నిర్మాణంలో గణనీయమైన మార్పులు అవసరం లేకుండా ఎలక్ట్రిక్ హైబ్రిడ్ ఆటో రిక్షాను అభివృద్ధి చేయవచ్చునన్నారు. అదే సమయంలో సోలార్ బ్యాటరీ చార్జ్ సిస్టమ్ సహాయంతో విద్యుత్ శక్తిని కూడా ఆదాచేయవచ్చని తెలియజేశారు. జాతీయ స్థాయి పేటెంట్ పొందిన డీన్ ప్రొఫెసర్ జీ.శ్రీనివాసరావును చైర్మన్ లావు రత్తయ్య తదితరులు అభినందించారు.

మెనూ.. కచ్చితంగా అమలు కావాల్సిందే

ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎం.డి. ఖాసిం



విద్యార్థులు గీసిన చిత్రాలతో ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎం.డి. ఖాసిం

ప్రత్తిపాడు: ప్రభుత్వం నిర్దేశించిన జగనన్న గోరుముద్ద మెనూ ప్రకారం కచ్చితంగా విద్యార్థులకు భోజనం అందించాలని ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎం.డి. ఖాసిం ఆదేశించారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని ప్రభుత్వ ఉర్దూ ప్రాథమిక పాఠశాలతో పాటు ప్రత్తిపాడు మండలం గనికపూడిలోని మండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలను శనివారం ఉదయం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పుల్లడిగుంట పాఠశాలలో పాఠశాలలో నో బ్యాగ్ డే సందర్భంగా విద్యార్థులు గీసిన రంగురంగుల చిత్రాలను పరిశీలించి, వారిని అభినందించారు. అనంతరం గనికపూడి పాఠశాలలో జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. భోజనం విషయంలో రాజీ పడవద్దని, నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. నిత్యం భోజనం నాణ్యతను పర్యవేక్షించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

శరవేగంగా అభివృద్ధి పనులు



పనులు పరిశీలిస్తున్న షేక్ నూరి ఫాతిమా

పట్నంబజారు: నగరం అభివృద్ధి పనులతో శరవేగంగా ముందుకు సాగుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మురళి ఫాతిమా చెప్పారు. తూర్పు నియోజకవర్గం అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా శనివారం నందివెలుగు రోడ్డులో జరుగుతున్న మరమ్మతుల్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూర్తిస్థాయిలో నాణ్యత ప్రమాణాలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి ఉందని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసమే నందివెలుగు రోడ్డును అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పోలవరపు జ్యోతి, వెంకటేశ్వరరావు, ఇఱ్ఱి సాయి, ఎఱ్ఱబాబు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.